## క్లుప్తంగా

### అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన ఆడారి నర్సింగరావు

కొమ్మాది: ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు గీతం ఉద్యోగి ఆడారి నర్సింగరావు ఎంపికయ్యారు. ఈయన ఇటీవల జరిగిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శాకరి శ్రీనివాస్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో అనన్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ప్రజలకు, ప్రయాణికులకు దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు స్థానిక నాయకుడు శాకరి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు శాకరి మురళీకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### 8న మండల సర్వసభ్య సమావేశం

పద్మనాభం: పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

### ప్రభుత్వ భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ కె.ఆనందరావు తెలిపారు. ఈ గ్రామంలో సర్వే నంబర్ 124లోని 1.50 ఎకరాల భూమికి గతంలో ఒక వ్యక్తికి డీ పట్టా ఇవ్వగా, ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. డీ పట్టాదారుడు కాకుండా వేరే వ్యక్తి ఈ భూమి మీద ఉండడంతో, దీన్ని స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలియజేశారు.

### పోరాట యోధుడు సుబ్బారావు



కార్మిక నాయకుడు సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్మికులు

మధురవాడ: పోరాట యోధుడు సుబ్బారావు అని సీఐటీయూ నాయకులు కొనియాడారు. సీఐటీయూ నాయకుడు దివంగత గొల్లపల్లి సుబ్బారావు ద్వితీయ వర్ధంతిని మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపం, స్వతంత్రనగర్ వార్డు ఆఫీసు తదితర ప్రాంతాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాములప్పడు, నాయకులు నరసియ్యమ్మ, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కె. సన్ని, ఎం రాజులు పాల్గొన్నారు.

### 94 శాతం పెన్షన్ల పంపిణీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో మంగళవారం 94 శాతం సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. నాలుగు వార్డులలో 8520 మందికి గాను 7977 మందికి రూ.3.43 కోట్లు పంపిణీ చేసినట్లు జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు.

### సీతారామాలయ వార్షికోత్సవం నేడు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ డొకరపేట సీతారామాలయ 9వ వార్షికోత్సవం బుధవారం జరగనుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఆహ్లాదం మాటున ప్రమాదం



ఆనకట్ట వద్ద జాలు వారుతున్న నీరు (ఫైల్ ఫోటో)

పరవశింపజేసే ప్రకృతి అందాల నడుమ తొణికిసలాడే గోస్తని నది సందర్శకులను చూపు మరల్చనీయదు. ఆహ్లాదకర వాతావరణంలో మది దోచే ఆ రమణీయతను ఆస్వాదించేందుకు యువకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. అయితే, ఆ ఆహ్లాదం మాటున పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టలేకపోతున్నారు. నది లోతు తెలియక మునిగిపోయి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.



సెల్ఫీలు తీసుకుంటున్న యువకులు

కురపల్లి వద్ద ప్రమాదకరంగా గోస్తని నది

ఈతకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువకులు

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ **కురపల్లి సమీపాన** గోస్తని నది తీరం ఎంతో ఆహ్లా**దకరంగా ఉం**టుంది. చూడడానికి కనుచూపు మేర నదిలో నీరు తొణికిలాసడుతూ చూపరులను ఆకట్టుకుంటుంది. అయితే, ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రాంతంలో నది 15 నుంచి 20 అడుగుల లోతు ఉంటుంది. నదిలో అడుగున పెద్ద రాళ్లు ఉన్నాయి. ఈతకు దిగేటప్పుడు సరిగా ఈత రాని యువకులు నది లోతు తెలియకపోవడంతో మునిగిపోయి **ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఈతకు దిగి ఆరుగురు యువకులు నదిలో మునిగి తనువు చాలించారు. అయినప్పటికీ యువకులు లెక్క చేయడం లేదు.**

కురపల్లి సమీపాన గోస్తని నదిలో ఆనకట్ట ఉంది. ఇక్కడ ఎప్పుడూ నీరు నిండుగా, తొణికిసలాడుతూ ఉంటుంది. ఇక్కడి నుంచి ఆనందపురం మండలం బోని వాటర్ వర్క్స్ ద్వారా ఎండాడ పంప్ హౌస్‌కు నీరు సరఫరా అవుతుంది. వర్షాకాలంలో నీరు ఆనకట్ట మీద నుంచి కిందకు జలపాతం మాదిరిగా జాలు వారుతుంది. వేసవిలోనూ **తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీరు వదులుతారు. ఈ నీరు కురపల్లి ఆనకట్ట వద్ద నిల్వ ఉంటుంది. ఈత కొట్టడానికి అనువుగా ఉండడంతో పట్టణ ప్రాంతాల నుంచి నిత్యం ఆనకట్ట వద్దకు ఎక్కువ మంది వస్తుంటారు. విశాఖ జిల్లా గాజువాక,** ఆరిలోవ, మధురవాడ, భీమునిపట్నం, తగరపువలసతో పాటు విజయనగరం టౌన్, చెల్లూరు నుంచి ప్రతి రోజు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో అధిక సంఖ్యలో యువకులు ఇక్కడికి వస్తుంటారు. ఆదివారం, సెలవు దినాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు యువకులు వస్తూనే ఉంటారు. మద్యం సేవించి నదిలో ఈత కోసం దిగుతారు.

### హెచ్చరిక బోర్డులు కనుమరుగు

**ఏడాది క్రితం కుర**పల్లి గ్రామ సమీపం**లో పంచాయతీ, పోలీస్** శాఖ హెచ్చరిక **బోర్డులు ఏర్పాటు చేసిం**ది. ఆర్అండ్‌బీ రోడ్డు **పక్క నుంచి ఆనకట్ట వద్ద** వరకు ఏర్పాటు **చేసిన ఈ బోర్డులు కనుమ**రుగయ్యాయి.

### మద్యం సేవించి.. దుర్భాషలాడి..

ఆనకట్ట వద్దకు వచ్చిన యువకులు మద్యం సేవించి స్థానికులను దుర్భాషలాడుతారు. ఆనకట్ట వద్దకు స్థానిక మహిళలు దుస్తులు ఉతకడానికి వెళతారు. నది తీరంలో పశువుల కాపర్లు పశువులను కాస్తుంటారు. కల్లు గీత కార్మికులు ఆనకట్టుకు ఆవతల వైపు ఉన్న పాండ్రంగి తాటి చెట్లు వద్దకు కల్లు తీయడానికి వెళతారు. వీరు ఆనకట్టు గట్టు మీద నుంచి ఈ తాటి చెట్లు వద్దకు వెళ్లి కల్లుసేకరిస్తారు. వీరు నడిచి వెళ్లడానికి కూడా వీల్లేకుండా ఈత కోసం వచ్చిన యువకులు గట్టుపైనే భీష్మించుకుని కూర్చుంటారు. దీంతో వారు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు, అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆనకట్ట వద్ద గోస్తని నదిలో నిండుగా నీరు

### హెచ్చరించినా .. వినిపించుకోరేం?

- తగరపువలస సమీపంలోని చెరుకుపల్లి, మధురవాడ, ఆరిలోవ ప్రాంతాలకు చెందిన ఆరుగురు నదిలో మునిగి మృతి చెందారు. 15 మందికి తలలకు గాయాలయ్యాయి. యువకులు తమ ఇంటి వద్ద చెప్పకుండా ఆనకట్ట వద్దకు ఈత కోసం వచ్చి ప్రమాదాల పాలవుతున్నారు.
- చెరుకుపల్లి, దాకమర్రి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడికి వినోదం కోసం వస్తారు. గతంలో ఈ ఆనకట్ట వద్దకు స్నానాల కోసం వచ్చిన ఒక ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సుమారు 40 మందిని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అయితే, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసు నమోదు చేయకుండా, కౌన్సెలింగ్ ఇచ్చి ఇళ్లకు పంపించారు.



నదిలో స్నానాలు చేస్తున్న యువకులు

### అసభ్యకరంగా మాట్లాడతారు



మేము ఆనకట్ట వద్దకు దుస్తులు ఉతకడానికి వెళతాం. పై నుంచి ఈత కోసం వచ్చిన యువకులు పూటుగా మద్యం సేవించి మహిళలని అని చూడకుండా దుర్భాషలాడుతారు. వీరి వల్ల ఆనకట్ట వద్దకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటోంది. ఆనకట్ట ప్రాంతం వద్ద పోలీసులు పహారా కాయాలి.

– ఎం.రమణమ్మ, కురపల్లి

### ఆనకట్ట వద్ద ఈత ప్రమాదకరం



ఆనకట్ట వద్ద గోస్తని నది లోతుగా ఉంటుంది. ఇక్కడ స్నానాలు చేయడం, ఈతకు దిగడం ప్రమాదకరం. గతంలో ఇది ప్రమాదకర ప్రాంతం అని తెలియజేస్తూ మా గ్రామంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ బోర్డులు కొంతకాలం తరవాత పోయాయి. ఇది ప్రమాదకర ప్రాంతమని తెలిసినా ఆనకట్ట వద్దకు ఈతకు వస్తున్నారు.

– ఎం.గణేష్, కురపల్లి

### యూపీహెచ్‌సీలో ఎన్‌క్వాష్ బృందం తనిఖీలు



ఆస్పత్రిలో బోర్డ్ పరిశీలిస్తున్న ఎన్‌క్వాష్ బృందం సభ్యులు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఈఎన్‌క్యూఎస్) బృందం మంగళవారం సందర్శించింది. ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీకి చెందిన డాక్టర్ రాంబాబు జైశ్వాల్, డాక్టర్ మనిషా శేఖర్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో సేవలకు సంబంధించి రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డ్, వాటర్ ప్యూరిఫయర్‌తో పాటు మందులు, ర్యాక్స్ అన్నీ పరిశీలించారు. ఇక్కడ 172 రకాల మందులు ఉన్నట్టు బ్యానర్‌లో పేర్కొనడంతో వాటిపై ఆరా తీశారు. ముఖ్యమైన విషయాలను ఫొటోలు తీశారు. ఆస్పత్రిలో రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ తనిఖీలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ సలోమి తదితరులు పాల్గొన్నారు.

### శక్తి యాప్‌పై అవగాహన



కొమ్మాది నర్సింగ్ స్కూల్ వద్ద అవగాహన కల్పిస్తున్న సీఐ నిర్మల

మధురవాడ: ఆపదలో ఉన్న బాలికలు, మహిళలు, లైంగిక వేధింపులకు గురయ్యే యువతులకు శక్తి యాప్ ఎంతో రక్షణ కల్పిస్తుందని ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ సీఐ నిర్మల అన్నారు. కొమ్మాది నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఫిర్యాదు చేసిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సంఘటన స్థలికి చేరుకుంటారని చెప్పారు. ఈ యాప్‌ను అందరితో డౌన్‌లోడ్ చేయించారు. ఆపదలో ఉన్నప్పుడు ఎలా ఉపయోగించాలో వివరించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌టవర్ వద్ద వివాదం

జియో కేబుల్ ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



బంగ్లామెట్ట వద్ద సెల్‌టవర్



విద్యుత్ స్తంభానికి చుట్టి వదిలేసిన జియో కేబుల్

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్టపై జియో-రిలయన్స్ నెట్‌వర్క్‌కు సంబంధించి కేబుల్ ఏర్పాటును స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. ఇప్పటికే ఇక్కడ బీఎస్ఎన్ఎల్ టవర్‌కు జియో, ఎయిర్‌టెల్ నెట్ వర్క్‌లకు సంబంధించిన ఏంటినాలు ఉండటాన్ని స్థానికులు గతంలో వ్యతిరేకించారు. ఇటీవల జియో గ్రూప్‌నకు సంబంధించి అప్‌గ్రేడేషన్‌లో భాగంగా అత్యాధునిక కేబుల్స్, మెషినరీ ఏర్పాటు కోసం టవర్ కింద భూమిలో బాక్స్ ఏర్పాటు చేశారు. మంగళవారం బయట నుంచి తీసుకువచ్చిన కేబుల్‌ను ఇక్కడి విద్యుత్ స్తంభానికి చుట్టేసి భూమిలో ఉంచిన బాక్స్‌లో మెషినరీకి బిగించే క్రమంలో స్థానికులు అడ్డుకున్నారు. దీనికి నిర్వాహకులు 'ఇది ఏపీ ఫైబర్ కేబుల్ అని, మెరుగైన కమ్యూనికేషన్ కోసం ఏర్పాటు చేస్తున్నామని' చెప్పినా వీరికి అనుమానం వచ్చి ఆరా తీయగా ఏపీ ఫైబర్ కేబుల్ కాదని, దొడ్డిదారిన జియో మరో లైన్ కేబుల్ వేస్తుందని తెలిసి మండిపడ్డారు. దీంతో జియో కేబుల్ నిర్మాణం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈపీడీసీఎల్ అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు కేబుళ్లు ఎలా చుట్టుకుంటూ వెళ్లిపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని బంగ్లామెట్ట వాసులు తెలిపారు.

## పాఠశాల వద్ద బాలిక బంధువుల ధర్నా



మధురవాడలోని పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న బాలిక బంధువులు

మధురవాడ: అభం శుభం తెలియని చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాలిక బంధువులు, రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మధురవాడ వాంబే కాలనీ సమీపంలోని శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇక్కడ ఎల్‌కేజీ చదువుతున్న విద్యార్థినిపై వ్యాయామ ఉపాధ్యాయుడు శుక్రవారం అత్యాచారానికి పాల్పడిన నేపథ్యంలో వారు నిరసన చేపట్టారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజమండ్రి నారాయణ తదితరులు మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి లోకేష్, కలెక్టర్ దృష్టికి విషయం తీసుకువెళ్తామన్నారు. విద్యాశాఖ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు పాఠశాల వద్దకి వచ్చి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సంఘటన స్థలికి పీఎం పాలెం ఎస్ఐ భాస్కరరావు సిబ్బందితో చేరుకుని, వారికి సర్దిచెప్పి, పరిస్థితి చక్కదిద్దారు.

## గంగసాని అగ్రహారం లే అవుట్ అభివృద్ధి చేస్తాం



అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం పంచాయతీలోని గంగసాని అగ్రహారం లే అవుట్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో రైతులు, వీఎంఆర్డీఏ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు 9 ఏళ్ల క్రితం ఫలసాయాన్ని కూడా వదులుకుని ప్రభుత్వానికి 245 ఎకరాల భూములు ఇచ్చారన్నారు. జాతీయరహదారి నుంచి లే అవుట్‌కు 80 అడుగుల రహ దారి నిర్మించనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో ల్యాండ్ పూలింగ్ జరిగితే రైతులకు ప్రతిఫలం వెంటనే అందేలా చేయాలన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ 2016లో తీసుకున్న ఈ భూములలో ప్రాథమికంగా లే అవుట్ వేసి 6 నుంచి 9 నెలల్లో రైతులకు కేటాయిస్తామన్నారు. 1 నుంచి 2 నెలల్లో రైతులకు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. డీ పట్టా భూములు కలిగిన రైతులకు 450 గజాల వంతున కేటాయించాలని ప్రభుత్వానికి లేఖలు రాశామన్నారు. సర్వే సవరణలు కూడా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చీఫ్ సిటీప్లానర్ కీర్తి, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారిపై లారీ బోల్తా



తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం జాతీయరహదారిపై మంగళవారం లారీ బోల్తా పడింది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి విద్యుత్ ఉపకరణాల లోడుతో విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మాణంలో ఉన్న విమానాశ్రయానికి వెళ్తూ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. విద్యుత్ పరికరాలు రోడ్డుపై జారిపోగా, డ్రైవర్ బాలయ్య స్వల్పంగా గాయపడ్డాడు.

### ముగిసిన సాధుమఠం తీర్థం



అమ్మవారికి హారతి ఇస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి సాధుమఠం తీర్థమహోత్సవాలు మంగళవారం ముగిశాయి. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామి మఠంతో పాటు పైడితల్లమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు చేశారు.

## సైనికుడికి అంతిమ వీడ్కోలు



ఉమా శంకరరెడ్డి (ఫైల్)



ఉమా శంకరరెడ్డి భౌతిక కాయానికి గౌరవ వందనం సమర్పిస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీ పాతపాలెం గ్రామానికి చెందిన సైనికుడు చేట్ల ఉమా శంకరరెడ్డికి మంగళవారం చిట్టివలస శ్మశానవాటికలో తోటి సైనికులు, మాజీ సైనికులు, భీమిలి సీఐ తిరుమలరావు సిబ్బంది తుది వీడ్కోలు పలికారు. 11 సిక్కు రెజిమెంట్ లక్నోలో విధులు నిర్వర్తిస్తున్న ఉమా శంకరరెడ్డి నెల రోజులక్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తరువాత విధులకు హాజరైనా, అస్వస్థత కారణంగా వారం రోజుల క్రితం సెలవుపై తిరిగి వచ్చారు. మల్కాపురంలోని కల్యాణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేజీహెచ్‌లో పోస్ట్‌మార్టం అనంతరం, మంగళవారం చిట్టివలస శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. సైనికుడికి కడసారి వీడ్కోలు పలికేందుకు సహోద్యోగులు, మాజీ సైనికులు తరలివచ్చారు. భీమిలి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో భీమిలి పోలీసులు ఉమాశంకరరెడ్డి భౌతిక కాయానికి గౌరవ వందనం చేసి గాలిలో కాల్పులు జరిపారు. మృతునికి భార్య సుశీలతో పాటు 9 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడు ఉన్నారు.

### ఆక్రమిత స్థలం పరిశీలన



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ మల్లేశ్వరరావు

కొమ్మాది:పరదేశిపాలెం కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నెంబర్ 64లో సుమారు 4 కోట్ల రూపాయలు విలువ చేసే 60 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు ఓ వ్యక్తి పదేపదే ప్రయత్నం చేస్తున్నాడు. తాజాగా ఇక్కడి స్థలాన్ని చదును చేసి ఆక్రమించుకునేందుకు ముమ్మర ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు ఆక్రమణ పనులను అడ్డుకున్నారు. అయితే మరల రాత్రి సమయాల్లో దుంప రెడ్డి అనే వ్యక్తి ఈ స్థలంలో పనులు చేస్తున్నాడు. దీంతో ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆదేశాల మేరకు ఆర్ఐ మల్లేశ్వరరావు ఆక్రమిత స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో రెండు సార్లు ఆక్రమణకు ప్రయత్నం చేశాడని, హెచ్చరించినా మళ్లీ స్థలం ఆక్రమణకు ప్రయత్నం చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. ఆక్రమణకు గురైన 60 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి పరిరక్షిస్తామని పేర్కొన్నారు.

### పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సత్కారం



రామారావుకు జ్ఞాపిక బహూకరిస్తున్న మురళీకృష్ణ

పీఎం పాలెం: వృత్తిపై అంకితభావంతోనే గుర్తింపు లభిస్తుందని 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ.మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఏవో)గా పని చేస్తున్న బీవీ రామారావు ఏవోగా పదోన్నతి పొంది తూర్పు గోదావరి జిల్లా డీపీసీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సభలో రామారావును ఘనంగా సత్కరించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రామారావు వంటి ఆదర్శవంతమైన వ్యక్తుల సేవలు పోలీస్ శాఖకు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు, అడిషనల్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్లు ఏవో, ఇతర అధికారులు పాల్గొన్నారు.